
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు


5★★

గురువారం 12 సెప్టెంబరు 2024

భూషణ్‌రావుపేటలో రైతు ఆత్మహత్యాయత్నం 7లో..

వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి 8లో..

టెక్ గణపతి



గూగుల్ మ్యాప్‌తో అనుసంధానం చేసిన ప్రత్యేక యాప్

- వినాయక విగ్రహాలకు పోలీసుల జియో ట్యాగింగ్
- గూగుల్ మ్యాప్‌తో ప్రత్యేక యాప్ అనుసంధానం
- ఆన్‌లైన్‌లో సమగ్ర సమాచారం
- ఒక్క క్లిక్‌తో మండపాల పూర్తి వివరాలు
- పోలీసుల నిరంతర నిఘా
- గణేష్ శోభాయాత్ర వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- నిమజ్జనోత్సవానికి పటిష్ట బందోబస్తు
- జిల్లా వ్యాప్తంగా 2,791 మండపాలు

జగిత్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యేటా జరిగే గణేష్ నవరాత్రి ఉత్సవాలు, సామూహిక నిమజ్జనం పోలీసులకు కీలకమైన ఘట్టాలు.. మండపం ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడం నుంచి విగ్రహం నిమజ్జనం వరకు అనునిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే... గతంలో మాన్యువల్‌గా జరుగుతున్న ఈ తతంగానికి పోలీసులు సాంకేతికతను జోడించారు. ప్రతీ వినాయక మండపానికి ఓ ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ కేటాయించడంతో పాటు దానిని జియో ట్యాగింగ్ ద్వారా పోలీసు అధికారిక యాప్ అనుసంధానిస్తున్నారు. ఫలితంగా తనిఖీల నుంచి నిమజ్జనం వరకు ప్రతీ అంశం జవాబుదారీగా, పారదర్శకంగా, సాంకేతికంగా ఉంటుందని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. ఉత్సవాల్లో ఏ విధమైన అపశ్రుతి దొర్లకుండా ఉండేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారు. జిల్లాలో 2,791 గణేష్ విగ్రహా మండపాలను ఏర్పాటు చేశారు.

పోలీస్‌స్టేషన్ వారీగా జియో ట్యాగింగ్..

జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల్లోని వినాయక విగ్రహాలను ఇప్పుడు జియో ట్యాగింగ్ చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ల వారీగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ముందస్తుగా ఉత్సవ కమిటీ నిర్వాహకులతో సమావేశమై ప్రతీ మండపానికి సంబంధించిన సమాచారం తీసుకున్నారు. కమి టీ సభ్యుల పేర్లు, సెల్‌ఫోన్ నంబర్లను సేకరించి ప్రతీ మండపంపైనా నిరంతర నిఘా ఉంచారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది ఎప్పటికప్పుడు మండ పాలను సందర్శిస్తూ తనిఖీల తాలూకూ వివరాలన్నింటినీ ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు.

ప్రతీది తెలిసేలా..

వినాయక విగ్రహాలను జియో ట్యాగింగ్ చేయడం వల్ల క్షేత్ర స్థాయిలో మండపం వద్ద జరిగే ప్రతి అంశం పోలీసుల దృష్టికి వస్తుంది. ఏ ఊర్లో ఎన్ని...ఏ మండలంలో ఎన్ని విగ్రహాలున్నాయనేది తెలుస్తుంది. ఎక్కడ ఉన్నాయి..? ఎప్పుడు ఏర్పాటు అయ్యాయి..? నిమజ్జనం ఎప్పుడు..? ఏ మార్గంలో వెళ్లి, ఎక్కడ నిమజ్జనం చేస్తారు..? తదితర వివరాలను తమ ట్యాబ్స్, స్మార్ట్ ఫోన్లలో చూసుకునే అవకాశం ఉంటుంది. నిమజ్జనం పూర్తయ్యేదాక ఆన్‌లైన్‌లో సమాచారం అందుబాటులో ఉంటుంది. ఊరేగింపు వెళ్లే దారి సైతం కనిపిస్తుంది. జియో ట్యాగింగ్ వల్ల ప్రతీ అంశం జవాబుదారీగా, పార దర్శకంగా ఉంటుంది. ఏ చిన్న సంఘటనకు ఆస్కారం ఉండదు. ప్రతీది క్షణాల్లో తెలుస్తున్నందున భక్తులతోపాటు వివిధ శాఖల అధికారులకు మేలు చేకూరుస్తుందని పోలీసు అధికారులు భావిస్తున్నారు.

తనిఖీలపై పర్యవేక్షణ...

ఓ ప్రాంతంలో మండపం ఏర్పాటు అయినప్పటి నుంచి అందులోని విగ్రహం నిమజ్జనం అయ్యే వరకు ప్రతి దశలోనూ పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది. గస్తీ విధులు నిర్వహించే బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల సిబ్బంది నిత్యం ఆయా మండపాల వద్దకు వెళ్లి పరిస్థితులను అంచనా వేయడంతో పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీలు ఎలా సాగుతున్నాయన్నది ఉన్నతాధికారులు ప్రత్యేక యాప్ ద్వారా తెలుసుకుంటున్నారు. ఏ మండపానికి ఏ పోలీసును లైజనింగ్ అధికారిగా నియమించారు...ఆయా అధికారులు వివరాలు...ఇలా ప్రతీ అంశము యాప్ ద్వారా అన్నిస్థాయిల అధికారులకూ తెలుస్తుంది. నిమజ్జన సమయంలో నిర్ణీత సమయంలో ఊరేగింపు ప్రారంభం కావడం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతీవిగ్రహం కదలికల్నీ గమనించే అవకాశం ఉంటుంది. ఏ విగ్రహం, ఏ సమయంలో ఎక్కడ ఉంది, ఎప్పుడు నిమజ్జనం చేస్తారు.. ఇంకా ఎన్ని విగ్రహాలు నిమజ్జనం కానున్నాయి.. తదితర వివరాలన్నింటిని ఆన్‌లైన్‌లో పరిశీలించే విధంగా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.



మండపాల వివరాలను పరిశీలిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

సాంకేతిక పరిజ్ఞానంతో పర్యవేక్షణ



అశోక్ కుమార్, ఎస్పీ, జగిత్యాల

జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు నిబంధనలు పాటించాలి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో జరిగేలా ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాము. ఆన్ లైన్‌లో మండపాల నిర్వహణకు అనుమతితో పాటు మండపాల సమగ్ర సమాచారాన్ని ఒక్క క్లిక్‌తో అందుబాటులో తీసుకువచ్చాము. జియో ట్యాగింగ్, గూగుల్ మ్యాప్‌తో యాప్ అనుసంధానం చేశాము. గణేష్ నవరాత్రులతో పాటు నిమజ్జనోత్సవంలో పోలీసులకు ప్రజలు సహకరించాలి.

ఆన్‌లైన్‌లో సమగ్ర సమాచారం

ప్రతి పట్టణం, మండల కేంద్రాలు, పంచాయతీలు, తండాల్లో నెలకొల్పిన వినా యక విగ్రహాల జియో ట్యాగింగ్, ఇప్పటికే ఒక కొలిక్కి వచ్చింది. పోలీసులు తమ వద్ద ఉన్న ట్యాబ్‌లో విఘ్నేశ్వరుడి మండపం ఫొటోని అప్‌లోడ్ చేసి గణపతి విగ్రహాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జియో ట్యాగింగ్ చేయ డం వల్ల ఆన్‌లైన్‌లోకి వెళ్లి లోకేషన్ ఆప్షన్ బటన్ నొక్కితే మండపం నెలకొల్పిన ప్రవేశం పేరు ఇట్టే తెలుస్తుంది. నిమ జ్జనం ఏ రోజు, ఏ నీటి వనరులో చేస్తారనే వివరాలు కూడా కనిపిస్తాయి. మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో అనుమతులిచ్చిన పోలీసులు ఇప్పుడు వాటికి జియో ట్యాగింగ్ చేయడంతో వాటి స్టేటస్‌ను సులభంగా తెలుసుకుంటున్నారు. అవాంఛనీయ సంఘటనల నివారణకు ఇది తోడ్పాటు నందిస్తుందని భావిస్తున్నారు.

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ వెల్ఫేర్ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో రెసిడెన్షియల్, జూనియర్ కళాశాల కేజీబీవీ, ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లలో ఉన్న మౌలిక వసతులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. హాస్టళ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభివృద్ధి అధికారులు సాయిబాబా, రాజుకుమార్, చిత్రు, డీఈవో జగన్ మోహన్ రెడ్డి, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 11: విషజ్వరాలు ప్రబలకుండా ప్రజలందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ బి సత్యప్రసాద్ సూచించారు. జగిత్యాల మండలం తిప్పన్నపేటలో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్య శిబిరంతోపాటుగా గ్రామంలో శానిటేషన్ అమలు తీరును ఇంటింటికి తిరిగి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసిబ్బంది చికిత్స అందిస్తున్నారన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. మందుల స్టాక్ రిజిష్టర్‌ను తనిఖీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అధికారుల బృందాలు అవగాహన కల్పిస్తున్నాయని ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సమియొద్దీన్, జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, మాతాశిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్‌రెడ్డి, అర్బన్ ఇన్‌చార్జి ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో సలీం, అధికారులు పాల్గొన్నారు.

● నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

ప్రజలు తమ ఇంటి పరిసరాలతోపాటుగా చుట్టూ పక్కల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట గ్రామంలో ఏర్పాటుచేసిన వైద్య ఆరోగ్యశిబిరంతో పాటుగా గ్రామంలోని శానిటేషన్ అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ డ్రై డేను తప్పకుండా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చిమొక్కలను తొలగించి ఫాగింగ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

పనులు వెంటనే చేపట్టాలి

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, సెప్టెంబరు 11: మండలంలోని బల్వంతాపూర్‌లో అర్థాంతరంగా నిలిచిన ప్రధాన రహదారి పనులను వెంటనే చేపట్టాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. రోడ్డు పనులు నత్తనడకన సాగుతుండడంతో ఇటీవల వర్షాలకు రహదారి పూర్తిగా బురదమయమై రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతుండగా గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. దీంతో ఎమ్మెల్యే బుధవారం రహదారిని పరిశీలించి వారం రోజుల్లో పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అన్నారు. ఎమ్మెల్యే వెంట విండో చైర్మన్ రాంలింగారెడ్డి నాయకులు ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఆగంతపు వంశీ, నక్క అనిల్, కృష్ణారెడ్డి, రమేశ్, హరినాథ్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

రాయికల్, సెప్టెంబరు 11: పట్టణంలోని మైతాపూర్ రోడ్డులో గల వాగు వద్ద నిమజ్జన ఏర్పాట్లను ప్రజాప్రతినిధులు, అధికారులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎస్సై అశోక్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హామీల అమలుకు కట్టుబడి ఉన్నాం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్, సెప్టెంబరు 11: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎల్లంపల్లి ప్రాజెక్టు ముంపు నిర్వాసితుల చెక్కులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి పంపిణీ చేశారు. ముక్కట్రావ్‌పేటకు చెందిన 24 మంది భూ నిర్వాసితులకు రూ.52 లక్షల విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. వెల్గటూర్ మండలానికి చెందిన 45 మందికి రూ.45,05,220 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులు, ఎండపల్లి మండలానికి చెందిన 31 మందికి రూ.31,03,596 విలువ గల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంపు నిర్వాసితులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకుపోగానే స్పందించి మిగిలిన పరిహారాన్ని మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. చెగ్యాం గ్రామానికి చెందిన 126 మంది నిర్వాసితులకు రూ.18 కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పది సంవత్సరాలు అధికారంలో ఉండి నిర్వాసితుల గురించి పట్టించుకోని వారు కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో, డీటీ సంతోష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ గోపిక జితేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మేరు గు మురళి, బందెల ఉదయ్, సందీప్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

● ప్రతీ ఒక్కరికి మెరుగైన వైద్యం..

పెగడపల్లి: ప్రతి పౌరుడికి మెరుగైన వైద్యచికిత్సలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని వెంగళాయిపేట గ్రామానికి చెందిన అంగలి సంతోష్ అనారోగ్యంతో బాదపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా చికిత్స ఖర్చులు పెట్టే ఆర్థిక స్థోమత లేక స్థానిక నాయకుల ద్వారా ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు లక్ష్మణ్‌కుమార్ లక్ష రూపాయలు ఎల్‌వోసీ మంజూరు చేయించి బాధితుడి తండ్రికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కడారి తిరుపతి, పూసాల తిరుపతి, సంధి మల్లారెడ్డి, కుంచె రాజేందర్, తోట మల్లేశం పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 11: అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ కిషన్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మండల పరిషత్ సమావేశం మందిరంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీఐ శ్రీనివాస్‌తో కలిసి పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ట్రాక్టర్ అసోసియేషన్, యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే తీసుకునే చర్యలపై వివరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ-చాలన్ ఇసుక రవాణను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు టోకెన్ పద్ధతి ద్వారా అనుమతి లభిస్తుందని తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్ మొదట పట్టుపడితే రూ. 25,000 జరిమానా విధిస్తామన్నారు. అదే ట్రాక్టర్ రెండోసారి పట్టుబడితే ట్రాక్టర్ సీజ్ చేసి యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ పనులు, దళిత బందులో పొందిన ట్రాక్టర్‌లో ఇసుక అక్రమ రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 11: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపవైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్



పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారాలను అందిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వయం ప్రతిపత్తి హోదా రావడాన్ని స్వాగతిస్తూ ఏర్పాటు చేసిన సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. స్వయం ప్రతిపత్తి హోదా రావడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల అభివృద్ధికి పీఎం ఉషా కార్యక్రమంలో భాగంగా నాలుగు కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని, టెండర్ల ప్రక్రియ సైతం పూర్తవుతుందన్నారు. నూతన భవన నిర్మాణ ప్లాన్ సైతం అద్భుతంగా ఉందన్నారు. కళాశాల వసతి సౌకర్యాల కోసం అదనపు తరగతి గదులు, ఆడిటోరియం, స్వయంప్రతిపత్తి పరీక్ష విభాగం ఏర్పాటు కోసం హామీ ఇస్తూ భవిష్యత్తులో ఆదర్శ కళాశాలగా తీర్చిదిద్దడానికి తన వంతు సహకారం అందజేస్తానన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కల్వకుంట్ల రామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ అలువాల జ్యోతి, కళాశాల సీపీడీసీ సెక్రటరీ డాక్టర్ శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ చంద్రయ్య, స్టాఫ్ సెక్రటరీ సంగీత, అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

● రూ. 48 లక్షల చెక్కుల అందజేత..

జగిత్యాల పట్టణంలోని పది మజీదుల అభివృద్ధికి ఎస్‌డీఎఫ్ నుంచి మంజూరు అయిన రూ. 48 లక్షల విలువ గల చెక్కులను మజీద్ కమిటీ సభ్యులకు బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పంపిణీ చేశారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్వార్టర్‌లో మజీదు కమిటీ సభ్యులకు చెక్‌లు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అలువాల జ్యోతి, మజీదు కమిటీ నాయకులు, ముస్లీం మైనార్టీలు తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరా మహిళా శక్తి'తో ఆర్థిక ప్రగతి

● వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



బొమ్మెనలో ఎంబ్రాయిడరీ యూనిట్‌ను ప్రారంభిస్తున్న విప్

కథలాపూర్, సెప్టెంబరు 11: కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకంతో గ్రామీణ మహిళలు ఆర్థిక పురోగతి సాధిస్తారని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని బొమ్మెనలో యమునా మహిళా సంఘం ఎనిమిది లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన కంప్యూటరైజ్డ్ ఎంబ్రాయిడరీ, కథలాపూర్‌లో మూడు లక్షలతో ఏర్పాటు చేసిన నాటుకోళ్ల యూనిట్లను ప్రారంభించిన అనంతరం విప్ మాట్లాడారు. మహిళలు స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ఇందిరా శక్తి పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. అనంతరం దుంపెటలో గణపతి మండపంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. 24 మందికి కల్యాణలక్ష్మి, 14 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, తహసీల్దార్ వినోద్, ఏపీఎం నరహ రి, పీసీసీ కార్యవర్గ సభ్యులు తొట్ల అంజయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్, తదితరులు ఉన్నారు.

మేడిపల్లి: రైతన్నకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ చేసి తీరుతామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మేడిపల్లిలో 83 మంది లబ్ధిదారులకు షాదీముబార్, కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం వల్లంపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు రమేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, నాగరాజు, నర్సారెడ్డి, నర్సయ్య, శంకర్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

భీమారం: మండలంలోని ఒడ్యాడ్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు ఒడ్డాడు రాజు, మాజీ ఉపసర్పంచ్ నూర మహేష్, బైర అంజయ్య మేడిపల్లి మండల కేంద్రంలో విప్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.



డిగ్రీ విద్యార్థులకు ఆర్బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

కొడిమ్యాల, సెప్టెంబరు 11: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఆధ్వర్యంలో డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ పోటీలను ఈ నెల 19, 20, 21 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్ తెలిపారు. మండలంలోని పూడూర్‌లో బుధవారం ఎఫ్ఎల్సీ మాట్లాడుతూ రిజర్వ్ బ్యాంక్ స్థాపించి 90 సంవత్సరాల్లో అడుగు పెడుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కోరారు. క్విజ్ పోటీలు జిల్లాస్థాయిలో ఆన్‌లైన్‌లో ఉంటాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి రాష్ట్ర, జోనల్, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తారన్నారు. విజేతలైనవారు లక్ష రూపాయల నుంచి 10 లక్షల రూపాయల వరకు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఒక కళాశాల నుంచి ఎంత మంది విద్యార్థులైనా పాల్గొనటానికి అవకాశం ఉందన్నారు. ఒక బృందంలో ఇద్దరు సభ్యులు ఉండాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 17లోగా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఆర్బీఐ 90క్విజ్.ఇన్‌వెబ్‌సైట్ లాగిన్ అయి నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న మధుసూదన్

ఎస్‌యూ డిగ్రీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 11: శాతవాహన యూనివర్సిటీ పరిధిలో ఏప్రిల్, జూన్-2024లో నిర్వహించిన డిగ్రీ (సీబీసీఎస్, రెగ్యులర్ బ్యాక్‌లాగ్)2, 4, 6వ సెమిస్టర్ రీవాల్యుయేషన్ పరీక్షల ఫలితాలను బుధవారం శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గంజాయి మొక్క సాగుపై కేసు

గంగాధర, సెప్టెంబరు 11: గంగాధర మండలం వెంకంపల్లి పరిధిలో బుధవారం గంజాయి మొక్కను గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫాం షెడ్డులో పనిచేస్తున్న ఇతర రాష్ట్ర కూలీలలు గత కొద్ది కాలంగా గంజాయి మొక్కను సాగు చేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు పౌల్ట్రీలో తనిఖీలు నిర్వహించగా గంజాయి చెట్టును గుర్తించినట్లు తెలిపారు. వ్యవసాధికారులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు


సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 11: సిరిసిల్ల పట్టణంలోని గణేశ్ నగర్‌కు చెందిన చాట్ల సుశాంక్ అనే ఇంటర్ విద్యార్థి అదృశ్యమైనట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. మంగళవారం ఎవరికీ చెప్పకుండా ఇంట్లోనుంచి వెళ్లిపోయాడని తల్లి రచన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన కోడం గంగాధర్ (53) అనే బీడీ టేకేదారు అదృశ్యమైనట్లు తెలిపారు. ఈ నెల 1వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గంగాధర్ తిరిగి రాలేదని అతడి కుమారుడు ప్రేమ్‌సాగర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.















మీడియా పేరుతో అక్రమాలు

● మహిళ అరెస్ట్

వేములవాడ, సెప్టెంబర్ 11: మీడియా పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న వేములవాడ మండలంలోని చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన చొక్కారాపు వనజ అనే మహిళను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వేములవాడ ఏఎస్‌పి శేషాద్రినిరెడ్డి తెలిపారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను బుధవారం వివరించారు. వనజ కొంతకాలంగా తాను ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్నానని గ్రామాల్లోని యువతకు మోసపూరితమైన మాటలు చెప్పి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని చెప్పారు. మీడియాలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తానని, అక్రిడిటేషన్ కార్డులు ఇప్పించడమే కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ప్లాట్లు, ప్రభుత్వ అసైన్డ్ భూములను కూడా ఇప్పిస్తానని మోసాలకు పాల్పడుతుందని చెప్పారు. ఇందులో భాగంగానే 2019 సంవత్సరంలో చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన చంద్రయ్య అనే వ్యక్తి నుంచి 16 లక్షల రూపాయలు, రామన్నపేటకు చెందిన రైతు ఆరుట్ల ఆది మల్లయ్యకు మూడు ఎకరాల వ్యవసాయ భూమిని తంగళ్లపల్లి మండలం అరంపల్లి వద్ద ఇప్పిస్తానని నమ్మించి పది లక్షల రూపాయలను తీసుకొని మోసానికి పాల్పడింది. మోసాలకు పాల్పడుతున్న వనజకు సహకరించిన మల్యాల గ్రామానికి చెందిన పీసరి శ్రీనివాస్, వనజలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

ఏటా తప్పని ప్రయాణ తిప్పలు

● జవారిపేటలో వర్షాకాలం ఇబ్బందులు ● హామీలకే పరిమితమైన వంతెన నిర్మాణం

ఇల్లంతకుంటచ సెప్టెంబరు 11: భారీవర్షం కురిసిందంటే తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో ఇబ్బంది పడటం జవారిపేట గ్రామవాసులకు సర్వసాధారణంగా మారిపోయింది. జవారిపేట, నర్సక్కపేట గ్రామాలలోని బిక్కవాగుపై ఉన్న లోలెవల్ వంతెన నాలుగు సంవత్సరాల క్రితం కురిసిన భారీవర్షాలతో కొట్టుకుపోయింది. కొట్టుకుపోయిన వంతెన ప్రాంతంలో పైపులు వేసి తాత్కాలిక రోడ్డు వేశారు. ప్రతి సంవత్సరం వర్షాలకు తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోతోంది. దీనితో గ్రామానికి ఆర్టీసీ బస్సులు నిలిచిపోతాయి. అనేక మంది విద్యార్థులు, వ్యాపారస్థులు ప్రతి రోజు నర్సక్కపేట గ్రామం వరకు నడిచివచ్చి బస్సులు ఎక్కి కరీంనగర్ వెలుతుంటారు. గత సంవత్సరం వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని శిలాఫలకం వేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. శిలాఫలకం మాత్రం ధ్వంసం అయింది. దీనిపై ఏఈ కిరణ్‌ను వివరణ కోరగా లోలెవల్ వంతెన స్థానంలో హైలెవల్ వంతెన కావాలని కోరడంతో ఆలస్యం జరిగిందన్నారు.



తెగిపోయిన జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్యలోని రోడ్డు

హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి


● ఎ కిరణ్, జవారిపేట



జవారిపేట, నర్సక్కపేట గ్రామాల మధ్యలోని బిక్కవాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాలి. ఇక్కడ వాగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. ప్రతి సంవత్సరం వర్షాలకు కొట్టుకుపోవడం సాధారణంగా మారింది. గ్రామస్థులు పడుతున్న ఇబ్బందులను ప్రజాప్రతినిధుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లాం.

మంత్రి దృష్టికి తీసుకెళ్లాం..

- డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే



గత ప్రభుత్వ వైఫల్యం వల్లనే జవారిపేట గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారు. శిలాఫలకం వేసిన వారు పనులు ఎందుకు ప్రారంభించలేదు. ప్రస్తుతం హైలెవల్ వంతెన నిర్మాణం కోసం ఎస్టిమేషన్లు వేసి రాష్ట్రమంత్రి దృష్టికి తీసుకపోయాం. త్వరలోనే నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభిస్తాం.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురికి జైలు

వేములవాడ, సెప్టెంబర్ 11: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురు వ్యక్తులకు వేములవాడ న్యాయస్థానం జైలు శిక్ష విధించిందని పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం తెలిపారు. 2016 సంవత్సరంలో జాతర గ్రౌండ్ వద్ద విధులు నిర్వహిస్తున్న శ్రీకర్ అనే కానిస్టేబుల్ ఒకే వాహనంపై ముగ్గురు ప్రయాణిస్తుండడం గమనించి వారిని ఆపి తనిఖీ చేయడానికి ప్రయత్నించగా ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు కానిస్టేబుల్‌పై దాడి చేసి గాయపరిచిన ఎండి రహీముద్దీన్, కూసం మధు, సంటి మహేశ్ అనే వ్యక్తులపై కేసు నమోదు అయిందని తెలిపారు. దీనిపై న్యాయస్థానంలో విచారణ జరిపిన న్యాయమూర్తి జ్యోతిర్మయి ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానాతో పాటు ఏడాది జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని సీఐ తెలిపారు.

బాకీ చెల్లించలేదని రైతుపై దాడి

ముత్తారం, సెప్టెంబరు 11: బాకీ తీర్చలేదని రైతుపై ఫర్టిలైజర్ షాపు యజమాని బుధవారం దాడి చేసి గాయపరిచాడు. మండలంలోని అడవిశ్రీరాంపూర్ గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన నిమ్మతి శ్రీనివాస్ అనే రైతు అదే గ్రామానికి చెందిన పరికిపండ్ల విద్యాసాగర్‌కు చెందిన ఫర్టిలైజర్ షాప్‌లో పత్తి, వరి పొలానికి ఎరువులు కొనుగోలు చేశాడు. ఇందుకు సుమారు 20వేల రూపాయలు బాకీ ఉన్నాడు. బాకీ చెల్లింపులో జాప్యం చేస్తున్నావంటూ రైతు శ్రీనివాస్‌పై మండల కేంద్రంలోని కాసర్లగడ్డ వద్ద షాపు యజమాని విద్యాసాగర్ కర్రతో తల, చేతులపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై నరేష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి ఆత్మహత్య

సుల్తానాబాద్, సెప్టెంబరు 11 : సుల్తానాబాద్ పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన కల్వల సుదర్శన్(57) అనే వ్యక్తి పదిరోజుల క్రితం అదృశ్యమయ్యాడు. దీనిపై అతడి భార్య పోలీసులకు సమాచారం అందించింది. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి చెందిన క్వార్టర్‌లో సుదర్శన్ ఆత్మహత్య చేసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు మండల పరిషత్ క్వార్టర్ల వద్దకు బుధవారం రాత్రి చేరుకొని చూడగా ఆత్మహత్యకు పాల్పడింది సుదర్శన్ అని గుర్తించారు. పదిరోజుల క్రితమే ఇంటినుంచి వెళ్లిపోయిన సుదర్శన్ అదేరోజు మండల పరిషత్ క్వార్టర్ల వెనుకభాగంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే బుధవారం రాత్రి ఆ ప్రాంతంలో దుర్వాసన రావడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

14న కరీంనగర్ అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం

● బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు11: నగరంలోని రెవెన్యూ గార్డెన్స్‌లో ఈ నెల 14న ఉదయం 11గంటలకు ది కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి తెలిపారు. బుధవారం బ్యాంకులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు సర్వసభ్య సమావేశానికి సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. గత పాలకవర్గం సర్వసభ్య సమావేశాన్ని నామమాత్రంగా నిర్వహిచి చేతులు దులుపుకున్నారని, ఇప్పుడు ఆ విధానానికి స్వస్తిపలికి సభ్యుల, ఖాతాదారుల సాధక బాధకాలను తెలుసుకొని అందరి సమక్షంలో నిర్ణయాలను ఈ సమావేశాల్లో తీసుకుంటామని చెప్పారు. కరీంనగర్ సహకార బ్యాంకుకు కరీంనగర్ మెయిన్ బ్రాంచ్‌తో పాటు జగిత్యాలలో బ్రాంచి ఉందన్నారు. త్వరలోనే గంగాధర ఎక్స్‌రోడ్‌లో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ సమయం తీసుకొని ఆయన చేతుల మీదుగా నూతన బ్రాంచ్‌ను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో సభ్యులు మడుపు మోహన్, ముక్క భాస్కర్, విద్యా సాగర్, లక్ష్మన్‌రాజు, సందీప్, రవీందర్‌రెడ్డి, బ్యాంకు సీఈవో నునుగొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ బ్యాంకు అసోసియేట్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి

కొండగట్టులో బాలుడి కిడ్నాప్ యత్నం

● మహిళను పట్టుకున్న స్థానికులు

మల్యాల, సెప్టెంబరు 11: దిగువ కొండగట్టులో బాలుడి అపహరణకు ఓ మహిళ యత్నించింది. దీంతో గమనించిన స్థానికులు మహిళను పట్టుకుని మల్యాల పోలీసులకు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి. దిగువ కొండగట్టులో నివాసముంటున్న తులసీ-సాయిక్రిష్ణ కుమారుడు విక్కీ ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. కొండగట్టు గుట్టపైకి వెళ్లే దారి కావడంతో అటు వైపు వచ్చిన మహిళ బాలుడిని లాక్కొని వేగంగా వెలుతూ అపహరణకు ప్రయత్నించింది. గమనించిన స్థానికులు మహిళను పట్టుకున్నారు. బాబును కుటుంబ సభ్యులకు అప్పగించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో మహిళను మల్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించగా విచారణ జరుపుతున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. అయితే ఆ మహిళ తీరును బట్టి చిన్నారులను ఎత్తుకెళ్లే ముఠాగా స్థానికులు అనుమానిస్తున్నారు. సదరు మహిళ బుధవారం మరికొందరు మహిళలతో కొండగట్టుకు వచ్చిన్నట్లు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి



దాసరి చరణ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 11: కరీంనగర్‌లోని కమాన్ నుంచి హౌజింగ్ బోర్డు కాలనీకి వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన స్తంభాన్ని ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి దాసరి చరణ్(21) దుర్మరణం చెందాడు. మారుతీనగర్‌కు చెందిన చరణ్ గచ్చిబౌలిలోని ఒక ప్రైవేట్ కళాశాలలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు సెలవుల కారణంగా వారం కిందట కరీంనగర్‌కు వచ్చాడు. మంగళవారం అర్ధరాత్రి చరణ్ స్నేహితుడు ప్రదీప్ ఫోన్ చేసి తనను బస్టాండ్‌లో దించాలని కోరగా చరణ్ తన ద్విచక్ర వాహనంపై దింపాడు. తిరిగి కమాన్ నుంచి మారుతీనగర్‌లోని ఇంటికి బైక్‌పై అతివేగంగా వస్తుండగా భారత్ పెట్రోల్‌బంక్ వద్ద బైక్ అదుపుతప్పి సిమెంట్ పోల్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించగా వైద్యులు పరీక్షించి మృతి చెందాడని వెల్లడించారు. తన కొడుకు అతివేగంగా బైక్ నడపటంతో అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడని మృతుడి తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థికి పాముకాటు

సుల్తానాబాద్, సెప్టెంబరు 11: సుల్తానాబాద్ పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బీ మన్విత్ అనే విద్యార్థిని బుధవారం పాము కాటేసింది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన మన్విత్ గురుకుల హాస్టల్‌లో ఉంటూ 6వ తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లగా విద్యార్థి మన్విత్‌ను పాము కాటువేసింది. విద్యార్థులు కేకలు వేయడంతో హాస్టల్ సిబ్బంది మన్విత్‌ను సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

పంట చేలల్లోకి భారీగా వరద నీరు

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 11: ఇటీవల కురుసిన భారీ వర్షాలకు వాగులు, చెరువులు, కుంటలు, అలుగులు పారుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువ నుంచి గోదావరి నదికి నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టు ద్వారా నీటిని వరద కాలువలోకి వదలడంతో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు మండలంలోని ఆత్మనగర్ గ్రామ పెద్ద తండా సమీపంలోని వరి పంట చేలల్లోకి భారీగా చేరింది. దీంతో కొన్ని పంట పొలాలు చెరువులను తలపించేలా మారాయి. ప్రధాన ప్రాజెక్టు ఎస్సారెస్పీలోకి పూర్తి స్థాయిలో నీరు చేరుకుంది. దీంతో అధికారులు 19వేల క్యూ సెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మండలంలోని మాన్వార్ వాగు ఇప్పటికే ఉధృతంగా ప్రవహిస్తోంది. మాన్వార్ వాగులోకి వరద కాలువ చేరి మరింత ప్రవహం పెరిగి నీరంతా వెనకకు రావడంతో ఆత్మనగర్ పెద్దతండా వద్ద జరుపుల పవన్‌నాయక్, శంకర్, రాజేశ్వర్‌లతో పాటు పలువురి రైతులకు చెందిన సుమారు 25 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగాయి. ఇలాగే వరద కాలువ ప్రవాహం కొనసాగితే మరిన్ని పంట పొలాలు నీట మునిగే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. నీట మునిగి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందించాలని కోరుతున్నారు.



ఆత్మనగర్‌లోని వరద కాలువ నీటితో మునిగిన పంట పొలాలు

భార్యకాపురానికి రావడంలేదని ఆత్మహత్య

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 11: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన చిలుకరవి (43) అనే వ్యక్తి తన భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెంది బుధవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మూడు నెలల క్రితం రవిని వదిలి అతడి భార్య గౌతమి ఇంటినుంచి వెళ్లిపోయింది. దీంతో రవి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ నేపథ్యంలో రవి జీవితంపై విరక్తి చెంది తన ఇంటిముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు రవి తల్లి అమృత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆదివాసీలపై అన్యాయంగా కేసులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 11: ఆదివాసీలపై పోలీసులు అన్యాయంగా కేసులు పెట్టారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుచిత్ అన్నారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఇటీవల జరిగిన గొడవల్లో అరెస్టు అయిన 10 మందిని కరీంనగర్ జిల్లా జైలులో ఉంచారు. వారితో కుటుంబ సభ్యులు, హైకోర్టు న్యాయవాదులు, బీజేపీ నాయకులు కరీంనగర్ జైలులో బుధవారం ములాఖత్ అయ్యారు. అనంతరం ఆదివాసీలతో కలిసి బీజేపీ నాయకులు కరీంనగర్ జైలు బయట మీడియాతో మాట్లాడారు. గత నెల 31న ఆదివాసీ మహిళ తన సోదరునికి రాఖీ కట్టి ఇంటికి వస్తుండగా ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించి తీవ్రంగా కొట్టాడన్నారు. ఈ ఘటనను ప్రమాదంగా చిత్రీకరించి నిందితుడు పారిపోయాడని, ఆ తరువాత మహిళ తనకు జరిగిన అన్యాయాన్ని బంధువులకు తెలిపిందన్నారు. నిందితుడు గతంలో ఓ గిరిజన మహిళ భర్తను హత్య చేసి ఆమెను లోబర్చుకున్నాడన్నారు. అదే వ్యక్తి మళ్లీ ఇప్పుడు అఘాయిత్యానికి పాల్పడటంతో గొడవలు చెలరేగాయన్నారు. 10 మంది ఆదివాసీలను అన్యాయంగా అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. జైలులో వారితో మాట్లాడేందుకు వచ్చామని, వారికి బెయిల్ కోసం ప్రయత్నిస్తున్నామని ఆయన తెలిపారు.



కరీంనగర్ జిల్లా జైలు ఎదుట మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దినసరి కూలీ అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 11: ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌కు చెందిన దినసరి కూలీ ఉత్తర్ల రాజేందర్ అదృశ్యమయ్యాడని, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని రాజేందర్ భార్య రేణుక బుధవారం తెలిపింది. గ్రామంలోని రాజేందర్ నిత్యం కూలీ పనుల కోసం చీర్లవంచ గ్రామానికి వెళ్లి వచ్చేవాడని పేర్కొంది. మూడు నెలల కిందట ఇంటి నుంచి కూలీ పనులకు వెళ్లిన తన భర్త రాజేందర్ ఇంటికి తిరిగి రాలేదని చెప్పింది. చుట్టుపక్కల, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంది.

మూడు నెలలుగా వెతికినా ఆచూకీ లభించలేదని వాపోయింది. గతంలోనూ పలుమార్లు అదృశ్యమై తిరిగి ఇంటికి వచ్చాడని తెలిపింది. తన భర్త అదృశ్యంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశానని రేణుక పేర్కొంది.

తృటిలో తప్పిన ప్రమాదం



అర్కండ్ల వాగుపై నీటి ప్రవాహంలో ప్రమాదకరంగా నిలిచిన కారు

శంకరపట్నం, సెప్టెంబరు 11: మండలంలోని అర్కండ్ల బ్రిడ్జిపై కారు అదుపు తప్పి బ్రిడ్జి కిందకి దూసుకెళ్తుండగా డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. కారు అర్కండ్ల లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వెళ్తుండగా నీటి ప్రవాహానికి బ్రిడ్జి కిందకి దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి బ్రేక్ వేయడంతో ముందు టైరు బ్రిడ్జి కిందకి జారి కారు ముందు భాగం బ్రిడ్జికి తగిలి అక్కడే ఆగడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కారులో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు.

మల్లన్న సన్నిధిలో సినీ నటుడు శివారెడ్డి పూజలు



మల్లన్నకు పూజలు నిర్వహిస్తున్న శివారెడ్డి

ఓదెల, సెప్టెంబరు 11 : ఓదెల మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి సన్నిధిలో సినీ నటుడు, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి పూజలు నిర్వహించారు. బుధవారం శివారెడ్డితో పాటు బీజేపీ నల్గొండ జిల్లా అధ్యక్షుడు రవికాంత్ ప్రదీప్‌కుమార్, ఎన్నారై దుర్గ ప్రసాద్, ప్రముఖ ఆర్టిస్ట్ భాస్కర్, వాసు, కేఎన్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో అభిషేకం, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఈవో సుధాకర్, సిబ్బంది వారిని సన్మానించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 11: మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులోని కీర్తన, శ్రీ కీర్తన ఫౌల్ట్రీ ఫాంలలో అక్రమంగా నిల్వ ఉంచిన 108 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు దాడులు చేసి బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ శివారులోని రెండు ఫౌల్ట్రీ ఫాంలలో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు వచ్చిన పక్కా సమాచారం మేరకు ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌తో కలిసి దాడులు నిర్వహించామన్నారు. అక్రమంగా నిల్వ ఉన్న 108 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన ఫౌల్ట్రీ ఫాం యాజమానులు గుజ్జే గంగాధర్, అంకతి రాజలింగం, ఆటో యాజమానులు కొండపల్లి కాంచెట్టి, సద్దుల సతీష్‌పై తో పాటు పరారీలో ఉన్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

● మెట్‌పల్లిలో 20 క్వింటాళ్ల బియ్యం సీజ్

మెట్‌పల్లి పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద అక్రమంగా పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకుని 20 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. మెట్‌పల్లి మండలం వెంపేట గ్రామం నుంచి ఆర్మూర్‌కు అక్రమంగా బియ్యం తరలిస్తుండగా పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఒకరిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

●తంగళ్లపల్లి: మండలంలోని అంకుసాపూర్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ సీఐ మొగిలి తెలిపారు. మంగళవారం రాత్రి అంకుసాపూర్‌లో బియ్యం తరలిస్తున్నారని సమాచారం మేరకు ఎస్సై సుధాకర్ దాడులు నిర్వహించారని, వ్యాన్‌లో పది క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తున్నారని తెలిపారు. బియ్యం తరలిస్తున్న తంగళ్లపల్లికి చెందిన సరుగు బాలయ్య, కొనుగోలు చేస్తున్న జిల్లెల్ల గ్రామానికి చెందిన పాండుపై కేసు నమోదు చేశామన్నారు.



వేములకుర్తిలో ఫౌల్ట్రీ ఫాంలో బియ్యం పట్టుకున్న సిఐ నిరంజన్‌రెడ్డి

● వీణవంక: మండలంలోని శ్రీరాములపేటలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకున్నారు. శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామనికి చెందిన అంగిడి సుధాకర్, లోకిని శ్రీనివాస్‌లు గ్రామాల్లో తిరుగుతూ 12 రూపాయల చొప్పున కొని ఇతర ప్రాంతాల్లో 17 రూపాయలకు అమ్ముతున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

భూషణ్‌రావుపేటలో రైతు ఆత్మహత్యాయత్నం

● రుణమాఫీ కాకపోవడంతోనేనని బీఆర్ఎస్ ఆరోపణ



చికిత్స పొందుతున్న రైతును పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల/కథలాపూర్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం భూషన్‌రావుపేట గ్రామానికి ఏనుగు సాగర్‌రెడ్డి (46) అనే రైతు బుధవారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సాగర్‌రెడ్డిని కుటుంబ సభ్యులు గమనించి చికిత్స కోసం కథలాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సాగర్‌రెడ్డి ఆరోగ్యం విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. రైతు రుణమాఫీ కాకపోవడంతోనే సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. చికిత్స పొందుతున్న సాగర్‌రెడ్డిని బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ తదితరులు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ మాట్లాడుతూ గత నెల 20న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కథలాపూర్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న సాగర్‌రెడ్డి తనకు రుణమాఫీ కాలేదని ఆవేదన చెందుతూ పురుగుల మందు తాగే ప్రయత్నం చేశాడని వివరించారు. అప్పుడు తాము అడ్డుకున్నామని తెలిపారు. ఇప్పుడు రుణమాఫీ కాలేదని, తనకు అప్పులు మిగిలాయన్న బాధతో రైతు సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. రుణమాఫీ జరగకున్నా కనీసం ఆసుపత్రిలో సరియైన వైద్యం సైతం రైతుకు అందించే పరిస్థితి లేదని విమర్శించారు.

కాంగ్రెస్ పాలనలో రైతుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అబద్ధపు పునాదుల మీద రేవంత్‌రెడ్డి పాలన నడుస్తోందని విమర్శించారు. రుణ మాఫీ జరిగిందని సంబరాలు చేసుకున్న కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సాగర్‌రెడ్డి ఆత్మహత్యాయత్నం సంఘటనపై ఏమీ సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శీలం ప్రియాంక ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు ఒల్లం మల్లేశం, నాయకులు దయ్యాల మల్లారెడ్డి, పడిగెల గంగారెడ్డి, హరీశ్, ప్రణయ్, నీలి ప్రతాప్, మణికంఠ, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

భగత్‌నగర్, సెప్టెంబరు 11: తెలంగాణ సాయుధ పోరాట అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జె వెంకటేశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని ముకుందలాల్‌మిశ్రా భవన్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి సాయుధ పోరాట వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. 13న తెలంగాణ చౌక్ నుంచి అనభేరి ప్రభాకర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ, 15న జిల్లా సదస్సు, 17న గ్రామాల్లో సెమినార్లు, సభలు నిర్వహించాలన్నారు. దేశ సంపదను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అమ్మివేస్తోందన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాల మూలంగా నష్టాన్ని జాతీయ విపత్తుగా పరిగణించి నష్టపరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి, సత్యం, టీమా సాహెబ్, సంపత్, అశోక్, డినరేష్, తదితరులు పాల్గొన్నారు.

కొడుకులు చేరదీయడం లేదని ఠాణాకు చేరుకున్న వృద్ధురాలు

ఇల్లందకుంట, సెప్టెంబరు 11: కుమారులు కూడు పెట్టడం లేదంటూ ఓ తల్లి ఠాణాకు చేరుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లి గ్రామానికి చెందిన ఉడుత కొమురమ్మకు ఐదుగురు కుమారులు, ఒక కూతురు ఉంది. భర్త సింగరేణి ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందిన తర్వాత మృతి చెందాడు. కొమురమ్మ సొంత గ్రామమైన పర్లపల్లిలో ఉంటుంది. ఐదుగురు కొడుకులకు గాను ఇద్దరు సింగరేణి ఉద్యోగం చేస్తుండగా, ఒకరు చనిపోయారు. మరో ఇద్దరిలో ఒకరు ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామంలో ఉండగా, మరొక అతను జమ్మికుంటలో ఉంటున్నాడు. కొమురమ్మ బుధవారం సిరిసేడులో ఉంటున్న సదయ్య అనే కుమారుడి వద్దకు చేరుకోగా కోడళ్లు రావద్దంటూ వెళ్లగొట్టారు. దీంతో ఆమె ఇల్లందకుంట పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా అక్కడ ఉన్న సిబ్బంది కొడుకుకు ఫోన్‌చేసి పిలిపించారు.

సదయ్య ఠాణాకు చేరుకొని సిబ్బందితో మాట్లాడుతూ నేను ఒక్కడినే కాదు ఇంక ముగ్గురు ఉన్నారు. వారు కూడా రావాలని సమాధానం ఇచ్చాడు. ఎస్ఐ రాజకుమార్ వెంటనే కోడళ్లతో మాట్లాడి మీ అత్తమ్మ కొమురమ్మ మీ ఇంటికి వస్తుంది. ఆమెను సాకాలని మిగతా కొడుకులను పిలిపించి మాట్లాడుతానని చెప్పి సిరిసేడులో ఉంటున్న కొడుకు వద్దకు పంపించారు.



పోలీస్‌స్టేషన్‌లో వృద్ధురాలు కొమురమ్మ

విద్యార్థులకు సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్


విద్యార్థులతో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 11: మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు సమస్యలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ సూచించారు. బుధవారం గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు కల్పించిన వసతులు, డబుల్ కాట్ బెడ్స్, డెస్క్‌లు, నూతన భవనంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని వసతులు, సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, గురుకులంలో ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని, ఉంటే నేరుగా దృష్టి తీసుకరావాలని ప్రిన్సిపాల్ మాధవీలతకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులంలో జరిగిన ఘటనల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు చాలా భయందోళనకు గురయ్యారని, వారి భయాన్ని తొలగించే విధంగా పాఠశాల నిర్వహకులు ఉండాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, సానిటేషన్ పనులు చేపించాలన్నారు. ఈయన వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు, గురుకుల ప్రిన్సిపాల్ మాధవీలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

కోరుట్ల: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాలలో బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వేదపండితుడు పాలెపు రాంశర్మ మంత్రోత్చరన మధ్య ప్రత్యేక పూజలు జరుగుగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పూజలో పాల్గొన్ని ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మెన్ సింగిరెడ్డి నారాయణరెడ్డి, కోరుట్ల, మెట్‌పల్లి మాజీ ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి, కౌన్సిలర్ బట్టు సునిల్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ నాయకులు అన్వర్, రమేష్, రహీంపాషా పాల్గొన్నారు.

స్వీట్‌హౌస్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

మున్సిపల్ కమిషనర్‌కు ఎంఆర్‌పీఎస్ నేతల ఫిర్యాదు

జగిత్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న ఓ స్వీట్‌హౌస్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు బుధవారం ఎంఆర్‌పీఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సమ్మయ్యను కలిసి సమస్యను విన్నవించారు. పరిశుభ్రత లోపంతో సదరు స్వీట్ హౌస్ నిర్వహిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుమాల గంగారాం, నాయకులు బెజ్జంకి సతీష్, బోనగిరి కిషన్, పోడేటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు

కొడిమ్యాల, సెప్టెంబరు 11: మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన కంకణాల శ్రీకాంత్ దోహాకత్తర్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 10 వేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామన్నారు. ఎమ్మెల్యే వెంట సీనియర్ నాయకుడు మహిపాల్‌రెడ్డి, సింగిల్ విండో ఛైర్మన్ రాజనర్సింగరావు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, రాజు,అజయ్‌గౌడ్, అంజయ్యగౌడ్, విక్రంగౌడ్, భరత్, ఉన్నారు.

రహదారిని పరిశీలించిన నాయకులు

మల్యాల, సెప్టెంబరు 11: మండలంలోని మానాల శివారులో గల రహదారి ఇటీవల వర్షాలకు కొట్టుకుపోగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచనలతో కాంగ్రెస్ మండల నాయకులు పరిశీలించారు. రహదారితో పాటు కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోవడంతో మానాల, తక్కళ్లపల్లి గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ప్రజలు ఎమ్మెల్యే సత్యంకు సెల్‌ఫోన్ ద్వారా తమ సమస్యను వివరించారు. రహదారిని పరిశీలించి రావాలని ఎమ్మెల్యే తెలుపడంతో మాజీ సర్పంచ్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఆగంతం వంశీధర్, నరసింహారెడ్డి, మ్యాక లక్ష్మణ్ ఆయా గ్రామాల ప్రజలతో దెబ్బతిన్న రహదారిని పరిశీలించారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఈజీఎస్ అధికారులతో మాట్లాడారు. తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో చందు, సాగర్, కందుల మల్లయ్య, మహేశ్‌గౌడ్, విశాక్ తదితరులు ఉన్నారు.

ఉపకార వేతనం కోసం దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రారంభించిన జాతీయ విదేశీ విద్యా ఉపకార వేతనం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ సత్య ప్రసాద్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాజుకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాల్లో పీజీ, పీహెచ్‌డీ చేసేందుకు ప్రతీ సంవత్సరం 125 మంది ఎస్సీ విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9951723628కు కాల్ చేసి సంప్రదించాలని కోరారు.

బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి

జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు

కథలాపూర్, సెప్టెంబరు 11: విద్యార్థులకు ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమని బాగా చదివి సమాజంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సత్ప్రవర్తన కలిగి పలువురికి ఆదర్శంగా నిలివాలని క్రమం తప్పకుండా కళాశాలకు రావాలని అన్నారు. భవిష్యత్‌లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడాలన్నారు. ఇంటర్ దశ జీవితానికి ఓ జంక్షన్‌లాంటిదని మంచి దారి ఎంచుకుని పయనించాలిని దిశా నిర్దేశం చేశారు. ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు ఉన్నారు.

నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

పెగడపల్లి, సెప్టెంబరు 11: వినాయక నిమజ్జనోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని పెగడపల్లి ఎస్.ఐ రవికిరణ్ పేర్కొన్నారు. మండలంలోని 23 గ్రామాలలో ఏర్పాటు చేసిన దాదాపు 160 గణేష్ మండపాలను బుధవారం ఎస్.ఐ రవికిరణ్ పోలీస్ సిబ్బందితో కలసి జియో ట్యాగింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్.ఐ రవికిరణ్ మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద డీజే సౌండ్స్‌తో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సత్తయ్య, పీసీలు సంపత్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ తెరుచుకున్న శ్రీరాంసాగర్ గేట్లు

జగిత్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు గేట్లను ప్రస్తుత సీజన్‌లో బుధవారం సాయంత్రం మరోమారు తెరిచారు. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు ఎక్కువగా వస్తుండడంతో సాయంత్రం 7 గంటల సమయంలో ఐదు వరద గేట్లను పైకి ఎత్తి 15,620 క్యూసెక్కుల నీరును దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. కాగా ఎస్సారెస్పీలోకి 43,985 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. కాగా మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరాలకు కలిపి ప్రాజెక్టు నుంచి 43,985 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద గేట్ల ద్వారా 15,620 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,000 క్యూసెక్కులు, వరద కాలువకు 19,000 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 300 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 2,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి


నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

జగిత్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వినాయక నిమజ్జనోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్‌లు అన్నారు. బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి వినాయక నిమజ్జనోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిమజ్జనోత్సవం ఎలాంటి ఆటంకం లేకుండా సజావుగా సాగే విధంగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈనెల 16,17వ తేదీల్లో నిమజ్జనోత్సవం ఉన్నందున భారీ విగ్రహాలను క్రేన్లు, పడవల సహాయంతో ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చూడాలని సూచించారు. అదేవిధంగా నిమజ్జన ప్రదేశాలలో గజ ఈతగాళ్లను, హెల్పర్ల ను ఉంచాలని, వారిని గుర్తు పట్టే విధంగా టీ షర్టు అందజేయాలని తెలిపారు. నిమజ్జన స్థలంలో బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీఓ మధు సూదన్, డీఎస్పీ రఘు చందర్, మున్సిపల్ ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి పాల్గొన్నారు.

కోరుట్ల: ప్రశాంత వాతవరణంలో గణపతి నిమజ్జనం నిర్వహించుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని గణపతి నిమజ్జన రూట్ మ్యాప్‌ను పరిశీలించి పట్టణ శివారులోని వాగును ఎస్పీ అశోక్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వరరావు, మెట్‌పల్లి ఆర్డీవో, కోరుట్ల ఇన్‌చార్జి నక్క శ్రీనివాస్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి పరిశీలించారు. వినాయక నిమజ్జనం రోజు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు, రెవెన్యూ, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిరుపతి, తహసీల్దార్ కిషన్, సీఐ సురేష్‌బాబు, ఎస్ఐలు శ్రీకాంత్, శ్వేత అధికారులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): భక్తులకు, మండప నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ జి సత్యప్రసాద్ సూచించారు. బుధవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే పట్టణ శివారులోని వట్టివాగును, పరిసర ప్రాంతాలను కలెక్టర్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జన ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని కోరారు. అక్కడకు వెళ్లేందుకు రోడ్లు బాగు చేయాలని సూచించారు. వాగు లోపల పూడికతీత తీయడంతో పాటు చుట్టూ లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వట్టి వాగు చుట్టు బారికేడ్లు, జనరేటర్ ఏర్పాటు చేయాలని కోరారు. అదే విధంగా వినాయక ప్రతిమలను నిమజ్జనం చేసేందుకు రెండు క్రేన్లు, ఒక చైన్ మిషన్ ఏర్పాటు చేసి మూడు నిమజ్జన పాయింట్లు పెట్టాలన్నారు. కలెక్టర్ వెంట ఎస్పీ అశోక్‌కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, డీఎస్పీ ఉమా మహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ టి మోహన్, డీఈ నాగేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

ధర్మపురి: ప్రశాంత వాతావరణంలో వినాయక నిమజ్జనం నిర్వహించాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ అన్నారు. ధర్మపురి క్షేత్రంలోని పలు వినాయక మండపాలను, గోదావరి నది వద్ద వినాయక నిమజ్జనం కోసం బుధవారం ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మపురి పట్టణంలో మున్సిపల్, రాయపట్నంలో గ్రామ పంచాయతీ, ఏర్పాట్లు గురించి సంబంధిత అధికారులతో ఆయన చర్చించారు. ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ గంగుల మహేష్, మున్సిపల్ ఛైర్ పర్సన్ సంగి సత్యమ్మ, మండల తహసీల్దార్ కృష్ణ చైతన్య, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ బాలె గంగాధర్, ఆర్ఐ వెంకటేష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 11: పారిశుధ్య పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని అయిలాపూర్‌లో పారిశుధ్య పనులను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థాయి సిబ్బందికి, గ్రామస్థాయి అధికారులకు పలు సూచనలు సలహాలను అందించారు. గ్రామంలోని మురికి కాల్వలను పరిశీంచి బ్లీచింగ్ పౌడర్ చల్లే విధానంపై అవగాహన కల్పించారు. ఇళ్లలో ఉన్న తొట్టిల్లో నీటిని తొలగించాలని కాలనీ వాసులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, కార్యదర్శి నవీన్, గ్రామపంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

పెగడపల్లి, సెప్టెంబరు 11: పెగడపల్లి మండల కేంద్రంలో బుదవారం ఎయిడ్స్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. పద్మవాణి సొసైటీ ఆధ్వర్యంలో హెచ్‌ఐవీ ఎయిడ్స్, సుఖ వ్యాదులు, టిబి వ్యాదుల పట్ల గ్రామ ప్రజలకు, గ్రామ పంచాయతీ కార్మికులకు వ్యాదుల లక్షణాలు, వాటి నివారణ మార్గాలు తదితర అంశాల గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లింక్ వర్కర్ పద్మ, ఆరోగ్య సిబ్బంది శంకరమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గదిలోకి మారిన అంగన్‌వాడీ కేంద్రం

కొడిమ్యాల, సెప్టెంబరు 11: మండలంలోని పూడూర్‌లోని 3వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఉన్నత పాఠశాల గదిలోకి బుధవారం అధికారులు మార్చారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రం గది శిథిలావస్థకు చేరినందున ఉన్నత అధికారుల ఆదేశాలతో మార్చినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ సుధారాణి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వెంకటేశ్వర్లు, ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలో విష జ్వరాలు లేవా?

వెల్గటూర్, సెప్టెంబరు 11: బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో విష జ్వరాలు లేవా? అని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ హయాంలో ఒక్క డెంగ్యూ కేసు కూడా నమోదు కాలేదనడం హాస్యాస్పందంగా ఉందన్నారు. అధికారుల లెక్కల ప్రకారం 2022లో 320 డెంగ్యూ కేసులు, గత సంవత్సరం 200 పైచిలుకు కేసులు నమోదు కావడం నిజం కాదా ? అని ప్రశ్నించారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారమే ఎజెండాగా పెట్టుకొని ముందుకు సాగుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ప్రజాసమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శించడం తగదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గోపిక జితేందర్‌రెడ్డి, మెరుగు మురళి, శ్రీనివాస్, రమేష్, నరేష్, వెంకటేస్, తిరుపతి గంగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

కొడిమ్యాల, సెప్టెంబరు 11: ఆత్మహత్యల నివారణపై కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ పి తిరుపతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు, గురువులు, బంధువులు విద్యార్థుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వేణు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి




రాయికల్‌లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు, కోరుట్లలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో

రాయికల్, సెప్టెంబరు 11: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాయికల్ మున్సిపల్ వైస్‌చైర్మన్ గండ్ర రమాదేవి అన్నారు. రాయికల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మండల స్థాయి పాఠశాలల ఆటల ఎంపిక పోటీలు నిర్వ హించగా మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి వాలీబాల్ ఆడి పోటీలను ప్రారంభించారు. బాలికల అండర్-14, అండర్-17 బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో గంగాధర్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రాఘవులు, మండల క్రీడల కార్యదర్శి కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: మండల పాఠశాలల క్రీడా ఎంపికలు బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ ప్రభుత్వపాఠశాలలో ఎంఈవో గాయత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో గాయత్రి మాట్లాడుతూ క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో పీడీలు కోటేశ్వర్‌రావు, అజయ్‌బాబు, మల్లీశ్వరి, వెంకటలక్ష్మీ, హారిక, రాధిక, రాజ్‌చందర్, సతీష్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ ఆరె తిరుపతి పాల్గొన్నారు.

బుగ్గారం: బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు బుధవారం ముగిసినట్లు మండల విద్యాధికారి గంగాధర్ తెలిపారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు పీడీ అరుణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌రెడ్డి, సీఆర్‌పీ పురుషోత్తం, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని ఎంపీడీవో స్వరూప కోరారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఎంఈవో అయిత శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలను ఎంపీడీవో స్వరూప, ఎస్సై సందీప్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కన్వీనర్ బూట్ల రాజమల్లయ్య, వైస్ ఛైర్మన్ విజయేంద్ర, జిల్లా సెక్రెటరీ లక్ష్మీరాంనాయక్, కార్యదర్శి వంశీవర్దన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: పాఠశాల క్రీడలు క్షమశిక్షణను నేర్పుతాయని మండల విద్యాధికారి నరేశం అన్నారు. బుధవారం పట్టణంలోని జూనియర్ కళాశాల మైదనంలో మండల స్థాయి క్రీడల ముగింపు సమావేశంలో పోటీలలో ప్రతిభ కనపరించిన పాఠశాల విద్యార్థులకు పథకాలతో పాటు ప్రశంస పత్రాలు మెడల్స్‌ను అందించారు. కార్యక్రమంలో పీఈటీలు ఆశోక్, విజయ్‌కుమార్, శ్రీనివాస్, మహిపాల్, శంకర్, గీత, శంకర్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో పాల్గొన్న ప్రభుత్వ విప్


గోదావరిలో నిమజ్జనం చేస్తున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి, సెప్టెంబరు 11: ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బుధవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మొదట క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి గణపతి భజన, సంకీర్తనల నడుమ గోదావరి నది వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గణనాథుడిని గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. వినాయక నిమజ్జనం సందర్భంగా ధర్మపురి గోదావరి నది వద్ద జరిగే ఏర్పాట్లను పోలీస్, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని, లైటింగ్ సిస్టమ్ సరిగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం నిర్వహించుకోవాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐ గంగుల మహేష్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్ పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో పూజలు..

గొల్లపల్లి: విఘ్నాలు తొలగించి ప్రజలందరిని సల్లంగా చూడాలి గణనాథ అంటూ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ వినాయకుడిని వేడుకున్నారు. బుధవారం గొల్లపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లోని పలు వినాయక మండపాలను ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన వినాయక ఉత్సవమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పలు మండపాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ భీమ సంతోష్, జిల్లా గ్రంథాలయాల సంస్త మాజీ ఛైర్మన్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ శాఖల అధ్యక్షులు నిశాంత్ రెడ్డి, మహేష్, మాజీ సర్పంచ్ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలో నెకొల్పిన వివిధ వినాయక మండపాల వద్ద బుధవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పూజలు నిర్వహించారు. వీరా, నానీ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడికి పూజలు చేశారు. ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయకుడి వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, మేరుగు మురళి, సందీప్ రెడ్డి, బందెల ఉదయ్, శ్రీకాంత్‌రావు, వెంకటేష్, శ్రీనివాస్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నిల్వ ఉంచిన కలప పట్టివేత

రాయికల్, సెప్టెంబరు 11: రాయికల్ పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను బుధవారం అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అక్రమంగా నిల్వ చేసిన కలపతో పాటు పత్రాలు లేని ఫర్నీచర్‌ను సీజ్ చేసి తరలించారు. ఈ దాడుల్లో రేంజ్ ఆఫీసర్ భూమేష్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పద్మ, సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య, బీట్ ఆఫీసర్‌లు ఇలియాజ్, రత్నాకర్ పాల్గొన్నారు.

కొల్వాయిలో గణేషుని నిమజ్జనం

బీర్‌పూర్, సెప్టెంబరు 11: మండలంలోని కొల్వాయి గ్రామంలో బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన గణపతి మండపం నిర్వహకులు బుధవారం నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండపం నిర్వహకులు ట్రాక్టర్‌పై ప్రత్యేక వేదికను ఏర్పాటు చేశారు. డప్పుల చప్పుల్ల మధ్య నృత్యాలు చేస్తూ ఊరి శివారున ఉన్న వాగులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పాత పద్మరమేష్, మాజీ సర్పంచ్ యేసుదాసు, సింగిల్‌విండో ఛైర్మన్ నవీన్‌రావు, మండపం నిర్వహకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

మెట్‌పల్లి(ఇబ్రహీంపట్నం): మెట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం మహిళలకు ఉచితంగా రెండు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహాత్మజ్యోతిరావు పూలే గురుకులానికి ఒక మిషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం నుంచి శిక్షణ పొందిన బాలే అశ్వినిలకు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్, క్లబ్ సభ్యులు అందజేశారు.

- మెట్‌పల్లి మండలం వెల్లుల గ్రామ శివారులోని శివాజీ బీడి కంపెనీ యాజమాన్యం బీడి కార్మికులకు నాసిరకం తునికాకు ఇస్తున్నారని ఆరోపిస్తు బుధవారం ఏఐటీయూసీ జిల్లా నాయకులు పట్టణంలోని సహాయ కార్మిక అధికారికి ఫిర్యాదు చేశారు.

- పట్టణంలోని ఇంద్రనగర్‌కు చెందిన యువన్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు బత్తుల దీక్షిత్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు హైదారాబాద్‌లోని అసుపత్రిలో చికిత్స తీసుకుంటు మరణించినట్లు స్థానికులు తెలిపారు.

మెట్‌పల్లి రూరల్: మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దీపికను మండలంలోని ఆత్మకూర్ గ్రామంలోని సీనియర్ నాయకుడు, రైతు చౌటుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు.

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో గొర్రెలు, మేకలకు బుధవారం పీపీఆర్ వ్యాధి నివారణ టీకాలను పశు వైద్యాధికారి నరేష్ రెడ్డి వేశారు. ఈ సందర్భంగా 2900 జీవాలకు టీకాలు వేశామని పేర్కొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని జగిత్యాల డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

వెల్గటూర్: వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2001-02 పదోతరగతి విద్యార్థులు పాఠశాలకు సైన్స్ పరికరాలు పెట్టుకునే బీరువాను అందజేశారు. ఎంఈవో జమునాదేవి, ప్రధానోపాధ్యాయులు నందయ్య పూర్వ విద్యార్థులను అభినందించారు.

అంజన్న సన్నిధిలో నాగసాధువు

మల్యాల, సెప్టెంబరు 11: కొండగట్టు ఆంజనేయస్వామిని బుధవారం మహిళ నాగసాధువు దర్శించుకున్నారు. ఆలయంలో పూజలు నిర్వహించారు. కేదార్నాథ్‌లోని మాతాకీ శిఖర్‌కు చెందిన మహిళ నాగసాధువు అంజన్నను దర్శించుకున్నారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని పాటించాలని సూచించారు. ఆలయ ప్రధానర్చకులు, అర్చకులు, అధికారులతో మాట్లాడుతూ హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఆలయాలను సందర్శిస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

మల్యాల, సెప్టెంబరు 11: మల్యాల తూర్పువాడలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానికులు బుధవారం ట్రాన్స్‌కో ఏఈఈని కోరారు. ఈ మేరకు వినతి పత్రం అందజేసి ట్రాన్స్‌ఫార్మర్‌పై అధిక లోడ్ పడి నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుండగా ఇళ్లలోని టీవీలు, రిఫ్రిజిరేటర్లు, విద్యుత్ మోటార్లు, ఫ్యాన్లు దగ్ధం అవుతున్నాయని వివరించారు. వినతిపత్రం అందించిన వారిలో ఆసం శివకుమార్, సంగ నవీన్, కడారి శివ, సనావుల్లా ఉన్నారు

పశువైద్య శిబిరం

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 11: మండలంలోని కోండ్రికర్ల, చౌలమద్ది గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ, కోరుట్ల పశు వైద్య కళాశాల ఆధ్వర్యంలో పశువైద్య శిబిరంను నిర్వహించారు. బుధవారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరంలో మేకలు, గొర్రెలకు ఉచితంగా వ్యాధి నివారణ టీకాలను మండల వైద్యాధికారి డాక్టర్ మనీషా పటేల్ వేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నరేష్, పశు వైద్య కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ అంబిక పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఆవశ్యకత ప్రతీ ఒక్కరు తెలుసుకోవాలి


చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 11: ప్రతీ నిత్యం మనం తీసుకునే ఆహారంలోని ఆవశ్యకత పదార్థాల ప్రాముఖ్యతను ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని విధిత్ గార్డెన్‌లో పోషణ్ మాసోత్సవాలపై మెట్‌పల్లి ఐసీడీఎస్ పరిధిలోని మండలాల్లోని మహిళలు, అంగన్‌వాడీ టీచర్లకు సీడీపీవో మణెమ్మ నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన అతిథిగా హాజరయ్యారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు చిన్నారులు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత ను నివారించడానికి ప్రభుత్వం నిర్దిష్టమైన లక్ష్యంతో పోషణ మాసోత్సవాలను నిర్వహిస్తుం దన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ, బాలింతలకు, చిన్నారుల తల్లిదండ్రులకు పౌషికాహారం, విద్యపై ప్రాధాన్యతను వివరించా లన్నారు. పిల్లల బరువు, ఎత్తులు, జబ్బచుట్టు కొలతలను పరిశీలించి తక్కువ ఉన్న వారి తల్లిలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ మధుకుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు షమీనాసుల్తానా, హైమద్ బేగం, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. చిన్నారులకు చిత్రాలు చూపించడం, కథలు చెప్పడం, బొమ్మలు వేయించారు. పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, అంగన్‌వాడీ టీచర్లు జమున, రమాదేవి పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని గంగారాంతండా, సూరంపేట, దమ్మయ్యపేట, పూడూర్, అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషన్ మాసం కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేయించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమ చిరుధాన్యాలు, ఆకు కూరలు తినటం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుధారాణి, అంగన్‌వాడీ టీచర్లు, కార్యదర్శులు, ఆశావర్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.